# "గుండె సవ్వడి"

నాకింకా రెండేళ్ళ సర్వీసుంది. సచివాలయంలో జాయింట్ సెక్రటరీ కాగలిగానంటే అదంతా నా కృషి... పట్టుదలే ! మంచి ఫోకల్ డిపార్టుమెంటులో పనిచేస్తున్నానని చాలామందికి అసూయ. 'పట్టుపరిశ్రమ'లో ఆరితేరానని, మా సెక్రటరీ మేడమ్‌ను బుట్టలో వేసుకున్నానని ఆడిపోసుకుంటారు గాని నా పనితనాన్ని మెచ్చరు. "యు షో ద మాన్... హి విల్ షో ద రూల్" అనే కాంప్లిమెంట్ - 'వర్క్ కల్చర్' ఉన్న ఆఫీసరనే అంటుంటారు నా గురించి.

అటెండరు పోస్ట్‌లో వచ్చిన ఉత్తరం టేబుల్ మీద ఉంచాడు. ఉత్తరం మీది దస్తూరి చూడగానే ఎవరు రాసిందో తెల్సిపోయింది. ఆ ఉత్తరం చదవాలనే ఆసక్తిపోయింది. ఎనభైయేళ్ళు వచ్చినా ముత్యాల్లాంటి అక్షరాల్లో మార్పులేదు. ఆ ముసలాయన మారడు, ఆయన రాత మారదు. 'ఇ' మెయిల్, సెల్‌ఫోన్లు వచ్చాక ఉత్తరాలు రాసేదెవరు? యు. యస్. నుంచి సురేష్ ఇ.మెయిల్ ఇచ్చే ఉంటాడు. వాడేం రాశాడో చూడాలనిపించింది. వెంటనే సిస్టమ్‌లోకి లాగిన్ అయ్యి పాస్‌వర్డ్ కొట్టి, యాహూ హాట్ మెయిల్ ఓపెన్ చేశాను.

'నెల్సర్ టెక్నాలజీ' నుంచి జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీకి మారాడట. పే హైక్ గురించి, సౌండ్ మానేజ్‌మెంట్ సిస్టమ్, అవుట్ సోర్సింగ్ మూలంగా చెలరేగిన అలజడి గురించి మెయిల్ పంపాడు. అమ్మ నొక్కదాన్నే అమెరికా పంపి, నేను రాలేదన్న వాడి కోపం కూడా 'ఇ' మెయిల్‌లో కక్కాడు.

... వాడికేం తెలుసు? మేక్ హే వైల్ ది సన్ షైన్స్... దీపం ఉండగానే ఇల్లు చక్కపెట్టుకోవాలి.... సర్వీసులో ఉన్నప్పుడు నాలుగు డబ్బులు వెనకేసుకోకుండా అమెరికా పరుగెత్తితే ఎలా ?

"సార్, మేడమ్ పిలుస్తున్నారు" డోర్ నెట్టుకొచ్చి అటెండరు చెప్పేవరకూ నా దృష్టి

అంతా కంప్యూటర్ స్క్రీన్ మీదే ఉంది. సిస్టమ్ క్లోజ్ చేసి ప్రిన్సిపల్ సెక్రటరీ రూమ్‌లోకి వెళ్లాను.

ఎలక్ట్రానిక్ ఫైల్స్ మీద చర్చ జరుగుతుంది.

... ఫిజికల్ ఫైల్స్ మూవ్ చేయకూడదట...

నూరుశాతం 'ఇ' ఫైల్స్ మూవ్ కావాలట. ఛీఫ్ సెక్రటరీ నుంచి లెటర్ వచ్చింది.

"రామారావుగారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 30 శాతం ఫైల్స్ తెలుగులో రాసేవాళ్ళం. ఇప్పుడు అన్ని ఫైళ్ళూ కంప్యూటర్‌లో మూవ్ చేస్తే అధికార భాష అటకెక్కి కూర్చుంటుంది" అన్నాడో సెక్షన్ ఆఫీసర్.

"జవాబుదారీతనం ఉండదండి... ఎవరి సంతకాలూ ఉండవు. మినిష్టరుగారి పాస్‌వర్డ్ తెలుసుకుని ఎవరన్నా వారికి అనుకూలమైన ఆర్డర్ వేస్తే అది జి.వో. అయి కూర్చుంటుంది... ఎక్కడ అవసరమో అక్కడ కంప్యూటర్ ఉపయోగించుకోవాలిగాని పూర్తిగా కంప్యూటర్‌లోనే ఫైల్స్ మూవ్ చేయాలంటే కుదరదండి" అనేశాడు మరో అసిస్టెంటు సెక్రటరీ.

"జాయింట్ సెక్రటరీగారూ మీ అభిప్రాయం ఏమిటి?" నాపైపు చూస్తూ అడిగింది ప్రిన్సిపల్ సెక్రటరీ.

"మన రాష్ట్రం 'ఇ' గవర్నెన్స్‌లో ముందుంది... మన ప్రయత్నం మనం చెయ్యాలి... వేర్ దేర్ ఈజ్ విల్.... దేరీజ్ ఎ వే!" అన్నాను.

మేడమ్ మెచ్చుకోలుగా నావైపు చూసింది. నాకు కావాల్సింది అదే! కంప్యూరట్‌లో ఫైల్స్ మూవ్ చేయడం చాలా కష్టమని తెల్సినా అలా అనక తప్పలేదు. వరల్డ్ బ్యాంక్ లోన్ అసిస్టెన్స్‌తో రోడ్లు వెయ్యడంపై మరో గంట చర్చ జరిగింది.

తల వాచిపోయింది మీటింగులతో... మళ్ళీ మంత్రిగారి దగ్గర మీటింగ్... ఒకటే టెన్షన్... ఇవి కాక సందర్శకుల తాకిడి... వాళ్ళతో లావాదేవీలు... మరింత టెన్షన్...

సాయంత్రం అయిదయ్యింది.

కొంచెం ఆటవిడుపు.

అప్పుడే అమెరికా నుంచి ఇందిర ఫోన్ చేసింది.

"మీరే నాతో పాటు రాలేదని చక్రికి కోసం వచ్చింది. మీరు ఎప్పుడూ ఆఫీసు

పనులంటారు... ఇక్కడ రాత్రిళ్ళు నిద్ర రావడం లేదండి... పగలు నిద్ర వస్తుంది... మనకు పగలయితే ఇక్కడ రాత్రి కదా ! దీనిని ఇక్కడ 'జెట్‌లాగ్' అంటారట... మొన్న స్కైవాలీ... టాహక్ష సరోవరం చూసివచ్చాం... కాలిఫోర్నియా రాష్ట్రం చాలా అందంగా ఉందండి... ఎటువైపు వెళ్ళినా కొండలు, అడవులు... చూడ ముచ్చటగా ఉంది.... వచ్చే ఆదివారం లాస్‌ఏంజిల్స్ తీసుకువెళ్ళతాడట. డిస్నీలాండ్... హాలీవుడ్ చూపిస్తాడట... మీరు కూడా వచ్చినట్లయితే ఎంతో బాగుండేది... చిన్నబ్బాయి కనబడుతున్నాడా ? వాడింట్లో ఉండి అక్కడే భోజనం చేస్తే బాగుండేది... తండ్రీ కొడుకుల్లాగా ఉండరు... ఎవరి గొడవ వాళ్ళది... వాడేదో వ్యాపారంలో పెట్టుబడికి ఐదు లక్షలు అడిగాడు కదా ! ఏం చేశారు ? మీ ఆరోగ్యం బాగుంటున్నదా? హోటల్ భోజనం సరిపడుతున్నదా?" ప్రశ్నల వర్షం కురిపించింది.

నేను ముక్తసరిగా సమాధానం చెప్పేసరికి ఫోను పెట్టేసింది ఇందిర.

నాన్న రాసిన ఉత్తరం తీశాను.

"ప్రియమైన చిరంజీవి కృష్ణకు మీ నాన్న దీవించి వ్రాయునది. ఇచ్చట అంతా క్షేమం. నీ క్షేమ సమాచారములు తెలుపవలెను. ఇద్దరు మనవళ్ళూ కులాసాయేనని తలుస్తాను.

మన ఆరెకరాల మాగాణిలో వరి పంటకు సరిగ్గా నీరందక దిగుబడి తగ్గిపోయింది. కుప్పలు వేసే నాటికి కుంభవృష్టి కురిసి వరి ఓదెలు నీటిలో తేలాయి. అప్పులు పెరిగిపోతున్నాయి... మీ అమ్మ ఒంటిమీద బంగారం హారతి కర్పూరంలా కరిగి పోయింది. రెండెకరాల మెట్టభూమి అమ్మినా అప్పులు తీరలేదు. అప్పుల సుడిగుండంలో చిక్కుకు పోయినా రైతుకు ఈదడం తప్పదు కదా !

మా గొడవకేంగాని నీ ఉద్యోగం ఎలా ఉంది? అమెరికాలో ఉన్న మనవడికి, మీ ఊళ్ళో ఉన్న చిన్న మనవడికి ఆశీస్సులు... రెండేళ్ళు అయ్యింది నిన్ను చూసి. ఒక్కసారి వచ్చిపో... ఇంతే సంగతులు...

ఇట్లు

**అమరయ్య**

... అవును నాన్నను, అమ్మను చూసి రెండేళ్ళయ్యింది... ఆదివారం కారులో వెళ్ళి చూసిరావాలి... నాన్నకు నచ్చచెప్పి కొంత పొలం అమ్మించేసి చిన్నకొడుక్కి ఇవ్వాలి.... వాడేదో హోటల్ పెట్టుకుంటాడట...

అలసటగా అన్పించింది... మరోసారి టీ తెప్పించుకుని తాగి ఆఫీసు నుండి బయటపడ్డాను.

☆ ☆ ☆

ఫాల్గుణ మాసం వచ్చింది. చెట్లుచేమలు పచ్చదనంతో తొణికిసలాడుతున్నాయి. కొమ్మలు వయ్యారంగా ఊగుతున్నాయి. మల్లెలు విరగబూస్తున్నాయి. మామిడిపూత సౌరభం మత్తుగొలుపుతూ ఉంది. కోయిలలు గొంతు సవరించుకుంటూ 'కుహూ' అంటూ చైత్రమాసానికి స్వాగతం చెప్పడానికి సిద్ధమవుతూ ఉన్నాయి. చెట్ల నిండా గుత్తులు గుత్తులుగా విరగబూసిన మామిడిపూతలోని తేనె కోసం తేనెటీగలు పోటీపడుతూ గాలిలో గుంపులు గుంపులుగా నాట్యం చేస్తున్నాయి.

చెరుకు నరకడం, మినుముల నూర్పిడి పూర్తయ్యాయి. పెద్దగా పొలం పనులు ఏమీలేని రోజులవి.

కారు ఉయ్యూరు వరకూ బాగానే పోయింది. అక్కడ నుంచి పెనమకూరు వెళ్ళడం కష్టమయ్యింది. చెరుకు సీజను మూలంగా రోడ్డంతా పాడయింది. ఎడ్లబండ్ల తాకిడితో.

స్వగ్రామం చేరుకున్నాను.

రామాలయం గాలిగోపురం, ఊరి మధ్య చెరువు, పాత గ్రంథాలయం, వేపచెట్టు అరుగుమీద చేరి రాజకీయాలు, వ్యవసాయం కబుర్లు చెప్పుకుంటున్న గ్రామస్తులు కన్పించేరు.

సొంత ఊరును చూడగానే మనస్సు ఉల్లాసంతో ఊగింది.

ఎత్తయిన మట్టిదిబ్బ మీద ఉంటుంది మా ముందువాలోగిలి ఇల్లు. ఇంటి చుట్టూ కొబ్బరి చెట్లు. 'ఆ చెట్లకింద చేరితే ఎండుకాయలు రాలి నెత్తిమీద పడతాయి... ఆ చెట్లు కొట్టించెయ్యి నాన్నా!' అంటే ముసలాయన పట్టించుకోడు. ఇంటి చుట్టూ పెద్ద ప్రహారీ గోడ. ఆర్చీ దాటి నాలుగు అడుగులు ముందుకేస్తే రాధామనోహరాలు, మందారపూలు స్వాగతం చెబుతాయి. ఇంటి ముందు రాతి అరుగుల పక్కన ఎటుచూసినా పూలమొక్కలే !

ఇంటి ముందున్న పశువుల సావిడిలో పాడిగేదెకు మేత వేస్తున్నాడు నాన్న. ఆరడుగుల భారీ విగ్రహం, పెద్ద మీసాలు... ఆయన ఎనభైయ్యో పడిలో పడ్డాడంటే ఎవరూ నమ్మరు.

నన్ను చూసి కూడా సావిడిలో నుంచి బయటకు రాకుండా రేకు డబ్బాలో తవుడు తీసుకొచ్చి గాబులో కుడితి కలిపే ప్రయత్నంలో ఉన్నాడు.

ఈ ముసలాయనకు ఎందకీ అవస్థ ... హైదరాబాద్ వచ్చి ఎ.పి. రూములో కూర్చుని దర్జాగా ఉండొచ్చు కదా !

జీతగాడొచ్చి చేతిలోని సూట్‌కేస్ అందుకుని "బాబుగారు వచ్చారమ్మా!" పెద్దగా అరుస్తూ ఇంట్లోకి వెళ్ళాడు.

నాన్నని పలకరించకుండా లోపలికి నడిచాను.

"ఏరా...! ఇప్పుడేనా రావడం... కోడలు అమెరికా వెళ్ళిందటగా" చేతులు చీర కొంగుకు తుడుచుకుంటూ వంటింట్లో నుంచి వచ్చి అమ్మ కుశల ప్రశ్నలు వేసింది.

'మీకెందుకే ఈ అవస్థలు... హాయిగా పట్నం వచ్చి ఉండొచ్చు కదా!" అన్నాను.

నవ్వి ఊరుకుంది అమ్మ. ఎక్కువగా మాట్లాడదు. "పక్షులు ఆకాశంలో, సొర చేపలు సముద్రంలోనే ఉండాలి బాబుగారూ! పక్షుల్ని సముద్రంలోకి తీసుకెళ్ళాలని ప్రయత్నిస్తే చచ్చిపోతాయి" అన్నాడు మంగయ్య.

మంగయ్య ఎప్పటి నుంచో మా ఇంట్లోనే పనిచేస్తున్నాడు. ఇంట్లో సొంత మనిషిలా ఉంటాడు... నాకదే నచ్చదు... పనివాడు పనివాడే! గాడిద, గుర్రం ఒకటే అంటే ఎలా?

"నోరు మూసుకుని నీపని చూసుకోరా" వాడిని కసురుకున్నాను.

వాడు ఇంట్లో నుంచి బయటకు పోలేదు. పై పెచ్చు నవ్వుకుంటూ నా దగరకొచ్చేశాడు. "కొంప తీసి కొడతాడా ఏమిటి?" అనుకున్నాను మనస్సులో.

"చిన్నప్పుడు మిమ్మల్ని ఎత్తుకుని మోశాను బాబూ! నా భుజాల మీదకు ఎక్కి జుట్లు పట్టుకుని "గాడిదకుంకా.. పలుగెత్తు" అనేవారు... మీ ముద్దు మాటలకు మురిసిపోయేవాడిని... ఏదండీ! ఓ సిగిరెట్టు ఇవ్వండి... నోరు లాగుతుంది" చొరవగా నా జేబులో చెయ్యిపెట్టి సిగిరెట్ ప్యాకెట్ అందుకున్నాడు.

ఆఫీసులో నన్ను చూస్తే ఒణికిపోతారు అటెండర్లు. వీడేమో లెఖ్ఖచెయ్యడు... నవ్వాలో ఏడవాలో అర్థంకాలేదు...

"ఆవిరి కుడుము చేశాను... తిందువుగాని... మొహం కడుక్కో" అంది అమ్మ.

" ఆ చేత్తో నాక్కూడా పట్రండి అమ్మగారూ... మామిడికాయ పచ్చడి నంజుకుంటూ వేడివేడి మినప కుడుము తింటే మజాగా ఉంటుంది" అన్నాడు మంగయ్య.

బ్రెడ్ ఆమ్లెట్ తిని ఫ్రూట్ జ్యూస్ తాగే టైంలో ఆవిరికుడుము ఏం తింటాడు తను... ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా, ఎంత పౌష్టికాహారం తీసుకున్నా తను సంవత్సరానికి ఒకసారన్నా హాస్పిటల్‌లో అడ్మిట్ కావల్సిందే! బి.పి., షుగర్ కంట్రోల్లో ఉండవ్... ఆత్మీయ బంధువులు రోగాలే!

ఇంట్లో ఫ్రిజ్ ఉండదు... ఏ.సి. రూమ్ ఉండదు... అందుకే ఇక్కడ ఉండాలంటే ముళ్ళమీద ఉన్నట్లే ఉంటుంది... పొద్దున్నే ఆపిల్ ముక్కలు తినడం అలవాటు... 'ఇంట్లో ఫ్రూట్స్ ఏమన్నా ఉన్నాయా?' అని అడిగితే 'జామకాయలు, పండేసిన ఈతకాయలు, వేరుశెనక్కాయలు ఉన్నాయి' అంటుంది అమ్మ.

"పేరుకు తగ్గట్లే మీ అమ్మగారు అన్నపూర్ణమ్మ తల్లే బాబూ! అమృతహస్తం... ఏది చేసినా అమృతంలాగే ఉంటుంది... తిండిగింజలు లేవని ఇంటి ముందు ఎవరు వచ్చి నిలబడినా బియ్యం, కూరగాయలు ఇచ్చి పంపుతుంది... అడుక్కునేవాళ్ళకు 'మా ఇంట్లో నిండుకున్నాయి మరో ఇంటికి వెళ్ళు!' అని చెప్పడం విన్లేదు బాబూ!" చెప్పుకుపోతున్నాడు మంగయ్య.

అమ్మని వాడు పొగుడుతున్నాడని అనుకోలేదు ఆ క్షణంలో ఎప్పుడూ అశాంతిగా వుండే మనస్సు కొంచెం కుదుటపడినట్లనిపించింది. ఎండలో తిరిగొచ్చి చెట్టుకింద నిలబడి సేదతీర్చుకున్నట్లనిపించింది ఓ క్షణం అమ్మ పక్కన నిలబడినప్పుడు.

మరుక్షణంలోనే తనేం పనిమీద ఊరికి వచ్చిందీ గుర్తొంచ్చింది.

పశువుల సావిట్లో పని ముగించుకుని కాళ్ళు, చేతులు కదుక్కుని ఇంట్లోకి వచ్చాడు నాన్న.

"వీడిని ఇంట్లో కూర్చోబెట్టి, నువ్వు సావిట్లో పనిచేస్తున్నావా?" నాన్నని అడిగేను.

"పశువులకి మేతవేయడం, కుడితి పెట్టడం కూడా ఓ పనేనట్రా! సావిడి బాగుచేసేది వాడే, పశువుల్ని తోలుకెళ్ళేది వాడే, పొలం పనులు చూసేది వాడే... ఇంట్లోకి ఏం కావాలన్నా తెచ్చిపడేసేది వాడే!" అన్నాడు నాన్న.

నవ్వుకుంటూ ఆవిరికుడుము తినే ప్రయత్నంలో ఉన్నాడు మంగయ్య.

మధ్యాహ్నం భోజనాలయ్యాక అసలు విషయం ప్రస్తావించాను.

"పొలం అమ్మేసి హైద్రాబాద్ వచ్చేయండి... మీ మనవడి వ్యాపారానికి డబ్బు కావాలి."

నాన్న నోటి వెంట మాట రాలేదు.

భుజాన కండువా వేసుకుని బయటకు వెళ్ళిపోయాడు.

సాయంత్రం వనజ వచ్చింది బుట్టలో రెండు మూడు గిన్నెలు పెట్టుకుని.

వనజ నాకంటే రెండేళ్ళు చిన్నది. మూడెకరాలు ఇచ్చేడు నాన్న చెల్లికి పెళ్ళప్పుడు. ఆ మూడెకరాలు అమ్మేసుకున్నారు. బావ రెండెకరాలు కౌలుకు తీసుకుని కాలక్షేపం చేస్తున్నాడు.

"మా ఊరి మీదగానే కదరా అన్నయా నువ్వొచ్చింది... మా ఇంటికి రాకుండానే వచ్చేశావ్" నిష్ఠూరంగా అంది వనజ.

ఏం వెళతాడు వాళ్ళింటికి? తెగిపోయిన నులక మంచాలు, కోడిరెట్టలు... వాళ్ళ పూరింట్లోకి అడుగు పెట్టాలంటే ఒళ్ళంతా కంపరం...

"నీకు ఇష్టమని ఉలవచారు, పేలపిండి తీసుకువచ్చాను" ప్లేటుపెట్టి పేలపిండి ముందుంచింది.

"ప్లేటులో కాదే, గిన్నెలో వేసి స్పూన్ తెచ్చి ఇవ్వు... వివరం తెలీదు" అంది అమ్మ.

చిన్నప్పుడు ఇద్దరం పక్కపక్కన కూర్చుని పేల పిండి తినేవాళ్ళం.

బుగ్గనిండా పేలపిండి పోసుకుని 'పుసులూరు' అనమనేది. 'పుసులూరు' అనగానే నోట్లోని పేలపిండి గాలిలోకి ఎగిరిపోయేది.

నవ్వుకునే వాళ్ళం.

ఎప్పుడూ తల ఎగరేస్తున్నట్లు, గుండె దడదడా కొట్టుకుంటున్నట్లు అన్పించేది హైదరాబాద్‌లో. ఇక్కడా చప్పుళ్ళు విన్పించడంలేదు. గుండె సవ్వడి మెట్టెల సవ్వడిలా మధురంగా ఉంది.

ఇలా మెత్తబడిపోతే ఎలా? కొంచెం కరుగ్గానే ఉండాలి తన పని అయ్యేంతవరకు.

మరుసటి రోజు పోస్టాఫీస్ దగ్గర చలమయ్య మాష్టారు కన్పించేరు.

నాన్న వయస్సే ఉంటుందాయనకు. చిన్నప్పుడు ఆయన దగ్గర చదువుకున్నాడు తను.

"బాగున్నావా బాబూ! నిన్న మీ నాన్న నీ గురించే చెప్పాడు... పొలం అమ్మమన్నావట... తరతరాల నుంచి వస్తున్న పొలం. ఆ పొలం మీద మమకారం పెంచుకున్నాడు... వేరే వాళ్ళకు

అమ్మడం ఇష్టంలేదు... మీ చెల్లెలు వనజకు ఆ పొలం ఇచ్చేద్దామనుకున్నాడాయన."

"చెల్లెలికి మూడెకరాలు అంతకుముందే ఇచ్చేడుగా" అన్నాన్నేను.

"మీ బావ సంగతి తెలుసుగా నీకు... ఏ అలవాటూ లేదు... సిగిరెట్టు తాగడు, మద్యం ముట్టడు... పేకాడడు... ఎప్పుడూ వ్యవసాయం ధ్యాసే... ఒళ్ళు వంచి పనిచేసినా అతివృష్టి, అనావృష్టితో పంటలు పండక అప్పులపాలయ్యాడు... పొలం అమ్ముకున్నాడు... ఏ దారీలేక రెండెకరాలు కౌలుకు తీసుకుని బతుకు వెళ్ళబుచ్చుతున్నాడు... మీ నాన్న హైదరాబాద్‌లో ఎటూ ఉండలేడు... ఆ పొలం కూతురికి రాసిచ్చి వాళ్ళను చివరి రోజుల్లో తన దగ్గర ఉంచుకోవాలనుకున్నాడు... మనవడు అమెరికాలో, కొడుకు ఉద్యోగం హైదరాబాద్‌లో, మరో మనవడు వ్యాపారం మీకు ఆయన పొలం అవసరంలేదనుకున్నాడు... నువ్వొచ్చి ఆ పొలం అమ్మమనేసరికి నీరుగారిపోయాడు... ఎవ్వరికీ అపకారం తలపెట్టని ఆయనకు చివరిరోజుల్లో కష్టాలు వచ్చిపడేటట్లున్నాయి" అన్నాడు చలమయ్య మాష్టారు నిట్టూర్పు విడుస్తూ.

"ఆయనకు ఏ ఇబ్బంది లేకుండా నేను చూస్తాగా... నా దగ్గర ఉండొచ్చుగదా!"

"ఎనభైయ్యేళ్ళు ఈ ఊళ్ళో ఈ మట్టి వాసన పీల్చినవాడు మీ పట్టణంలో ఇమడలేడబ్బాయి... పొలం కొనుక్కోవడానికి ఊళ్ళో షావుకారుగారు ముందుకొచ్చాడట... రేపో ఎల్లుండో అమ్మేస్తాడట!"

"పొలం అమ్మేసి ఇక్కడే ఉంటే ఆయనకు ఆధారం?"

"అది నువ్వు ఆలోచించుకోవాల్సిన ప్రశ్న. ...అయినా ఈ ఊరివాళ్ళు ఆ ముసలాళ్ళిద్దరికి నాలుగు మెతుకులు పడెయ్యకపోరులే! ఆ దిగులు నీకెందుకు?"

ఆయన మాటలు గుండెల్లో గుచ్చుకున్నాయి. గుండెలో యాంజియోప్లాస్టీ జరుగుతున్నట్లనిపించింది. మూసేకుపోయిన గుండె నాడుల్లో రక్తం జలజల ప్రవహించింది.

పొలం తనకు అక్కర్లేదు... చెల్లెలికే ఇచ్చేయ్యాలి... అలా అనుకోగానే మనస్సు తేలికపడింది.

ఇంటికివెళ్లి నోటినిండా పేలపిండి పోసుకుని గట్టిగా 'పుసులూరు' అన్నాను. పేలపిండి గాలిలోకి ఎగిరింది. *

**(ఈనాడు కథల పోటీలో బహుమతి పొందిన కథ - 20-6-2004)**